# అప్పుడే వచ్చేసిందా ?

**(21-12-1990 ఆంధ్ర సచిత్ర వార పత్రిక)**

"భువనేశ్వరి వచ్చేసిందిట"

పక్కింటావిడ తల్లితో చెప్పిన ఆ మాట చెవుల్లో పడి, ఇవతలి గదిలో పేపరు చదువుతూ మంచమ్మీద పడుకున్న చంద్రశేఖర్ టక్కున లేచి కూర్చున్నాడు.

భువనేశ్వరి రావడమేమిటి? కొత్తగా కాపురానికి వెళ్లి వారంరోజులేగా అయింది... దగ్గిరా దాపా? బోలెడుదూరం... రోజున్నర ప్రయాణం చేసి వెళ్లాలి ఆ ఊరు... ఇలా వెళ్లి అలా వొచ్చేసిందేమిటి? ఎందు కొచ్చేసినట్టు? ఏదో బలీయమైన కారణం లేకపోతే కొత్తగా కాపరానికి వెళ్లిన మనిషి వారం తిరక్కుండా వచ్చేస్తుందా?

"అదేమిటి? అప్పుడే రావడం ఏమిటి? పోనీ... ఇప్పుడేదన్నా పండగో పబ్బమో ఉందా అంటే ఏవీ లేవుగా?" కామాక్షమ్మ ఆశ్చర్యానికి అంతులేదు.

"ఏమో! ఏం గొడవ పెట్టుకుందో వాళ్లాయనతో... మనకి చెప్తారు గనకనా? పొద్దున్నే ఏదో పనుండి మా ఎదురింటా విడ ఆ వీధికెళ్లిందిట... వాళ్ల ఇంటి గుమ్మంలో నిలబడ్డ భువనేశ్వరిని చూసిందిట... వచ్చాక నాతో చెప్పింది."

"ఈ కాలం ఆడపిల్లలు మరీను... బొత్తిగా సహనం అనేది ఉండట్లేదు. తుమ్మితే ఊడే ముక్కులా సంసారాలు చేస్తున్నారు. మనం ఇలాగే చేస్తున్నామా సంసారాలు?"

"బాగా చెప్పావు వదినా... ఆ భువనేశ్వరిది అదోరకం స్వభావం చిర్రెత్తు కొస్తుంది నాకు"

* * *

"నాకు మాత్రం ఆ పిల్లమీద సదభిప్రాయం ఉంది గనకనా? ఉత్త గర్విష్టి... పెంకిది..."

తల్లి అన్న ఆ మాటలకి తుళ్లిపడ్డాడు. చంద్రశేఖర్. ఇదేమిటి ఇలా అంటుంది? ఇంతవరకు తన నోటితో తనే ఎన్నిసార్లు భువనేశ్వరిని పొగడలేదు?

బుద్ధిమంతురాలు.... నెమ్మదైనది.... వినయం, నమ్రత ఉట్టిపడుతూ ఉంటాయని తనతో ఎన్నోసార్లు అనలేదూ? అయినా... ఆవిడకి ఈ కాలం ఆడపిల్లల మీద మంచి అభిప్రాయం లేదని తనకెప్పటి నించో తెలుసు.... నువ్వెంత అంటే నువ్వెంత అంటూ పొగరుగా ప్రవర్తిస్తారని, మాటకి మాట జవాబు చెప్తారని దుయ్యపడుతూ ఉంటుంది.. అదే తన మనసుకి బాగా పట్టిపోయింది కూడా... అందుకే ముప్ఫయ్యేళ్లొచ్చినా పెళ్లి వాయిదా వేస్తూ వస్తున్నాడు తను... ఆ వచ్చే అమ్మాయి ఎలా నడుచుకుంటుందో... ఆమె ప్రవర్తన ఎలా ఉంటుందోనన్న భయం... అను మానం....

భువనేశ్వరిని చేసుకుంటే బావుంటుదేమోనన్న ఆలోచన ఒకప్పుడు రాకపోలేదు.

డైరెక్టుగా కాకపోయినా...ఆ అర్థంవచ్చేలా చూచాయగా తల్లితో ఆ మాట అన్నాడు కూడా...

"పైసా కట్నం ఇచ్చుకోలేరు వాళ్లు" కొట్టిపారేసిందావిడ ఆ సంబంధాన్ని.

వెంటనే తగ్గిపోవాల్సొచ్చింది తను.

కట్నం మీద మోజు తనకీ ఉన్నట్టుంది...

"ఇది విన్నావుట్రా?" పక్కింటావిడ వెళ్లిపోగానే కొడుకు దగ్గిరకొచ్చి బుగ్గలు నొక్కుకుంది కామాక్షమ్మ.

"ఏవిటమ్మా?"

"ఆ భువనేశ్వరి కాపరానికిలా వెళ్లి అలా తిరిగొచ్చేసింది."

"ఎందుకో?"

"ఎందుకేవిటీ? అసలు వాళ్ల వంశమే అంత. వాళ్ల వేలు విడిచిన మేనత్త ఒకావిడిలాగే, పెళ్లి చేసుకుంది గానీ కాపురం చెయ్యలేదు... వాళ్ల చుట్టాల్లో ఇంకో ఆవిడ కూడా వాళ్లాయనతో ఎప్పుడూ తగువులు పెట్టుకుంటూ పుట్టింటికి వచ్చేస్తూ ఉండేది... ఆ తలబిరుసుతనమే ఆ పిల్లకీ వచ్చినట్టుంది."

అమ్మో! ఇన్నాళ్లూ భువనేశ్వరీ వాళ్ల కుటుంబం ఎంతో మంచి దనుకుంటూ వచ్చాడు తను... ఇలా ఏవేవో కథలున్నాయన్న మాట... ఇంకా నయమే... తను చేసుకున్నాడు కాదామ్మాయిని... సవ్యంగా కాపురం చేసేరకం కాదని ఇప్పుడు తెల్సింది...

కట్టుకున్నవాడితో కాపురం చెయ్యకుండా... నువ్వెంత అంటే నువ్వెంత అని... ఇలా నాల్రోజులకే తిరిగొచ్చేస్తుందా. తన తల్లి అభిప్రాయం అక్షరాలా సరియైనదే...

ఈ కాలం ఆడపిల్లలకి మంచీ, చెడూ, విచక్షణా జ్ఞానం, ముందూ వెనకా ఆలోచించి ప్రవర్తించడం, సహనం... ఏమీ లేవు.. అహంకారం, తొందరపాటు తనమే ఉన్నాయి....

★ ★ ★ ★ ★ ★

ఏమి ఎరగనట్టు ఆ సాయంత్రం భువనేశ్వరీ వాళ్లింటికి వెళ్లాడు చంద్రశేఖర్.

వీధి గుమ్మంలోనే ఎదురుపడింది భువనేశ్వరి.

కావల్సినంత ఆశ్చర్యం ఒకలబోశాడు గొంతులో "అదేవిటి... నువ్విక్కడ?... మొన్నేగా వెళ్లావు... ఇలా వెళ్లి అలా వచ్చేశావేంటి పతిదేవుడితో మూన్నాళ్లకే బోర్ కొట్టేసిందా? పారిపోయి వచ్చేశావు..."

కిలకిలా నవ్వింది భువనేశ్వరి.

"వేళాకోళం చెయ్యడం బాగానే ఉంది గానీ... లోపలికిరా...నీ హాస్యాలు మా వారి దగ్గిర ఆడుదువుగానీ..."

"ఏవిటి? మీ వారు... మీ వారు..... ఆయనా వచ్చారా?" గుటకలు మింగాల్సొచ్చింది.

"అదేవిటంత ఆశ్చర్యపోతున్నావు? ఇద్దరం కలిసే వచ్చాం."

ఎందుకలా తెల్లబోయి చూస్తావు. ఆయన ఈ ఊరు రావాల్సొచ్చింది కాబట్టే నేనూ వచ్చాను. హఠాత్తుగా అప్పటికప్పుడు ఈ ఊరు క్యాంపు వెళ్లమని హెడ్ ఆఫీసు నించి ఫోన్ రావడంతో అనుకోకుండా తప్పనిసరిగా ఆయన బయల్దేరాల్సొచ్చింది. కొత్తచోట... ఒంటరిగా నన్నొక్కదాన్నే వదిలిపెట్టి వెళ్లడం ఇష్టంలేక.. నన్నూ బయల్దేరదీశారు. వారంరోజులీ ఊళ్లో క్యాంపు..." నవ్వుతూ గబగబా చెప్పుకుపోయింది భువనేశ్వరి.

చంద్రశేఖర్ మొహంలో నెత్తురుచుక్క లేకుండా పాలిపోయింది.

★ ★ ★ ★ ★ ★